చెత్త ఫుల్ సంపద నిల్!



టెక్కలిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద నిరూపయోగంగా ఉన్న యంత్రాలు

- కొరవడిన చెత్త సంపద కేంద్రాల నిర్వాహణ
- మూలకు చేరుతున్న విలువైన యంత్రాలు

టెక్కలి: చెత్త సంపద కేంద్రాల నిర్వహణ కొరవడింది. దీంతో విలువైన యంత్రాలు మూలకు చేరుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వాహణలో భాగంగా చెత్తను సేకరించి వాటి ద్వారా రీసైక్లింగ్ విధానం కోసం కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రతీ పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వాహణ కొరవడుతోంది. వీధుల నుంచి సేకరించిన చెత్తను తడి, పొడి గా వేరు చేసి వీటి ద్వారా వానపాములతో సేంద్రియ ఎరువులుగా మార్చి రైతులకు అమ్మకాలు చేయాలి.



టెక్కలిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

మరో వైపు మిగిలిన పొడి చెత్త సీసాలు, పాలిథిన్ తదితర వాటిని అమ్మకాలు చేయగా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాకు జమ చేయాలి. అయితే టెక్కలి నియోజకవర్గంలో ఇటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెత్త ఫుల్‌గా సంపద నిల్‌గా మారుతోంది.

పర్యవేక్షణ చేస్తాం

టెక్కలి డివిజన్ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తాం. ఈ కేంద్రాల ద్వారా లక్ష్యం నెరవేరే విధంగా చూస్తాం. ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారుల నుంచి గట్టి ఆదేశాలు ఉన్నాయి.

– ఆర్.గోపిబాల, డీఎల్‌పీవో, టెక్కలి

పాడవుతున్న యంత్రాలు..

టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి తదితర మండలాల్లో 136 పంచాయతీల్లో మేజర్, మైనర్ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి క్లాప్ మిత్రలను నియమించారు. అంతేకాకుండా ఒకొక్కరికీ నెలకు రూ. ఆరు వేలు వేతనాలు కేటాయించారు. అయితే కొన్ని పంచాయతీల్లో క్లాప్ మిత్రలకు పూర్తి స్థాయిలో వేతనాలు అందడం లేదు. ఆయా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. మరో వైపు మేజర్ పంచాయతీల్లో సేకరించిన చెత్తను డంపింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు తప్పా ఈ చెత్త సంపద కేంద్రాలకు తరలించడం లేదు. దీంతో విలువైన యంత్రాలు మూలకు చేరుకుంటున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వాహణ సక్రమంగా ఉండాలనే లక్ష్యం నీరుగారిపోతోంది.



టెక్కలిలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో నిరూపయోగంగా మారుతున్న ఎరువుల తయారీ తొట్టెలు

వైద్యానికి ఆర్థిక సాయం

కవిటి: మండలంలోని గొర్లెపాడు గ్రామానికి చెందిన యువకుడు బూర్లె శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యానికి సుమారు నాలుగు లక్షల రూపాయలు ఖర్చవుతోందని వైద్యులు చెప్పారు. నిరుపేద కావడంతో ఆర్థిక స్థోమత లేదు. ఈ విషయం తెలుసుకున్న జైహింద్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శ్రీకాంత్‌కు సోమవారం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో గొర్లెపాడు సర్పంచ్ కరగాన వసంత, వైఎస్సార్‌సీపీ నేత కరగాన వల్లభరావు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌కు సాయాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్‌పై సభ్యుల మండిపాటు

- కోటబొమ్మాళి మండల సమావేశం

కోటబొమ్మాళి: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రోణంకి ఉమ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకున్నా ఇంతవరకూ రైతు భరోసాను రైతులకు చెల్లించకపోవడంపై మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజుతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, చిట్టివలస, తాటిపర్తి, లఖందిడ్డి, అక్కయ్యవలస సర్పంచ్‌లు ఎస్.వెంకటరమణమూర్తి, రెడ్డి లక్ష్మణ, సుంకరి జనార్దనలు మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావును నిలదీశారు. అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నా చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు మండిపడ్డారు. అలాగే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన 21 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా సస్పెండ్ చేయడం ఏమిటని డ్వామా ఏపీవో పి. హరిప్రసాదన్‌ను నిలదీశారు. సర్పంచ్‌ల తీర్మాణం లేకుండా టీడీపీ నాయకుల సిఫార్సుతో పనులు మంజూరు చేయడంపై మండల ఇంజినీర్ అంజిత్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులు చేసినప్పటికీ వారికి ఇవ్వాల్సిన బిల్లులు చెల్లించకుండా ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తాత్సారం చేస్తున్నారంటూ పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఎంపీడీవో ఫణీంద్రకుమార్ సభ్యులకు నచ్చజెప్పినప్పటికీ శాంతించలేదు. వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, పౌర సరఫరాల డీటీ రామచంద్రారావు, ఈవోపీఆర్డీ అనందరావు, ఐసీడీఎస్ పీవో చింతాడ హైమావతి పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హేమసుందరరాజు

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస మండలం కేధారిపురం గ్రామంలో శనివారం ఇరువర్గాల మధ్య కొట్లాట చోటు చేసుకుంది. మనస్పర్థలు కారణంగా ఇరువురు మధ్య మాటలు పెరిగి ఒకరిపై మరొకరు చేతులతో తోపులాటకు దిగారు. అనంతరం ఇరువర్గాల వారు కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు కాశీబుగ్గ సీఐ మోహనరావు తెలిపారు.

ముగిసిన ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల ఐదో తేదీ నుంచి నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ సోమవారంతో ముగిసింది. 14వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమర్‌నాథ్ సాహు, కల్నల్ ప్రసూన్ కుమార్ పండా పర్యవేక్షణలో నిర్వహించిన శిక్షణకు హాజరై ప్రతిభ చూపిన కేడెట్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, సుబేధార్ మేజర్ సుభాష్‌చంద్ పాల్గొన్నారు.

నేడు హ్యాండ్‌వాష్ డే

కంచిలి: యూనిసెఫ్ గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా హ్యాండ్ వాష్ ఆవశ్యకతను, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే కార్యక్రమాలను మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఏపీవో సనపల ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో స్వయంశక్తి సంఘాలతో కలిసి హ్యాడ్‌వాష్‌పై అవగాహన కల్పిస్తామన్నారు.

అనుమతి లేని నిర్మాణాలు ఆపండి



నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేని అనాధికార నిర్మాణాలను తక్షణమే నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. సోమవారం కాశీబుగ్గ పాతజాతీయ రహదారిలో నిర్మాణం చేస్తున్న ఓ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్ అప్రోవల్‌తో పాటు అన్ని రకాల అనుమతులు ఉన్నప్పుడు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ప్రేమ్‌చంద్, ఇతర అధికారులు ఉన్నారు.

ఉపాధి బిల్లులు మంజూరు చేయండి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మన్మథరావు

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకం కింద రుంకు గ్రామం నుంచి ఉదయపురం వరకు వేసిన గ్రావెల్ రోడ్డుకు బిల్లు మంజూరు చేయాలని ఆర్.హెచ్‌పురం సర్పంచ్ ఎన్ని మన్మథరావు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ బిల్లులు చెల్లించకుండా కొందరు అడ్డుపడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దంపతులు



అమ్మవారికి పూజలు చేస్తున్న రామారావు దంపతులు

ఇచ్ఛాపురం రూరల్: విజయనగరం పైడితల్లి అమ్మవారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఎమ్మెల్సీ దంపతులను ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు రామారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులను మంగళవారం చేపడుతున్న కారణంగా డొంకూరు, బూర్జపాడు, సన్యాసిపుట్టుగ గ్రామాలకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ రామారావు సోమవారం పరిశీలించారు. పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, శానిటేషన్ సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. పారిశుద్ధ్య సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

సోంపేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. సోంపేట మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ.. 117 జీవో రద్దు, కామన్‌సర్వీస్ రూల్స్ సాధన వంటి సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయ రంగం అనేక సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. వాటిని పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడే బాధ్యత తీసుకుంటానని హామీఇచ్చారు. ఉపాధ్యాయులు డి.గోవిందరావు, డి.గిరధరరావు, ఏపీటీఎఫ్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



సోంపేట ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న రఘువర్మ

ఇదేనా మహిళ ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం?

- ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఎంపీపీ నీలవేణి ధ్వజం



వజ్రపుకొత్తూరు రూరల్: కూటమీ నాయకులు, అధికారులు కలిసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ధ్వజమెత్తారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పల్లిసారథి గ్రామంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చేతులు మీదగా ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మహిళ ప్రజా ప్రతినిధుల పేర్లు లేకపోవడం శోచనీయం అని ఎంపీపీ అన్నారు. మహిళమైన ఎంపీపీ, జెడ్పీటీసీ, స్థానిక సర్పంచ్ పేర్లను శిలాఫలకంపై లేకుండా మహిళలను తీవ్రంగా అవమానించారని అవేదన వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో జరగాల్సిన ఈ పనులకు తీర్మానం చేసిన ప్రజా ప్రతినిధుల పేర్లను శిలాఫలకంపై విస్మరించడం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. కాగా మహిళ ఎమ్మెల్యే అయిన శిరీష తోటి మహిశా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. చెప్పేవి శ్రీరంగ నీతులు..చేసేవి మాత్రం ఏంటి అని అత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అధికారికంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రోటో కాల్ ఉల్లంఘన జరిగినప్పటికీ అధికారులు చోద్యం చూశారని అవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అవమానంపై న్యాయబద్ధంగా పోరాటం చేస్తామన్నారు.



ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకం

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

కంచిలి: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న తమ క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే చేపట్టాలని కాంట్రాక్టు లెకరర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు పసుపు రిబ్బన్లతో సోమవారం విధులకు హాజరై నిరసన తెలియజేశారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రభుత చేపట్టాలనే డిమాండ్‌తో వినూత్న రీతిలో దశల వారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు ప్రతినిధులు తెలిపారు. 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరవుతామన్నారు.



నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

వజ్జను సత్కరించిన కాష్యూలేబర్ యూనియన్



బాబూరావును సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావును పలాస కాష్యూ, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి అభినందించారు. లేబరు యూనియన్ అధ్యక్షులు అంబల క్రిష్ణమూర్తి, కార్యదర్శి సానా ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షులు బొంపల్లి సింహాచలం, కోనారి రాము ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ తొమ్మిదో లైన్‌లో జనావాసాల మధ్య ఉన్న గడ్డి కుప్ప సోమవారం మధ్యాహ్నం దగ్ధమైంది. బత్తుల నారాయణరావు పశువుల మేత కోసం ఖాళీస్థలంలో వరిగడ్డిని కుప్పుగా పెట్టి ఉంచారు. అయితే ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో పొగలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

• వర్ణశోభితం



బంగారం రంగులో నింగి మెరిసిపోయింది. సోమవారం సంధ్య వేళ ఇలా తళుకులీనుతూ కనిపించింది.

– ఇచ్ఛాపురం

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కేశుపురం పంచాయతీలో రూ.38 లక్షలు, బూర్జపాడు పంచాయతీలో రూ.35 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు బుద్ధ మోహనాంగి, గుజ్జు ఢిల్లీరావు, జనసేన నియోజక వర్గ సమన్వయకర్త దాసరి రాజు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో అభివృద్ధి పనుల శిలాఫలకం అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

మౌలిక సదుపాయాల కల్పనతో పల్లెలు అభివృద్ధి

వజ్రపుకొత్తూరు రూరల్: మౌలిక సదుపాయాల కల్పనతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పల్లిసారధి, చిన జోకులపాడు గ్రామాల్లో పల్లెపండగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన్‌రావు, మాజీ సర్పంచ్ అంబటి రామక్రిష్ణ ఉన్నారు.

సంతబొమ్మాళి: చిన్నతుంగం పంచాయతీ కష్ణచంద్రాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో పి.జయంత్‌ప్రసాద్ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. సర్పంచ్ శిమ్మ గోవిందరావు, ఉప సర్పంచ్ రత్నాల ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, శ్రీను రాందాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కంచిలి: అంపురం, చిన్నకొజ్జిరియా, పెద్దకొజ్జిరియా, మఖరాంపురం, జాడుపూడి గ్రామ పంచాయతీల్లో అధికారులు కార్యక్రమాన్ని చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఈవోపీఆర్డీ కె.ఈశ్వరి, డ్వామా ఏపీవో జి.ధనుంజయ పాల్గొన్నారు.

కుమార్‌నాయక్‌కు ఉత్తమ విలన్ అవార్డు



డాక్టర్ కుమార్‌నాయక్

కాశీబుగ్గ: అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఉత్తమ విలన్ క్యారెక్టర్ అవార్డుకు పలాసకు చెందిన నటుడు డాక్టర్ కుమార్ నాయక్ ఎంపికయ్యారు. ఎవడు సినిమాకు వాడే హీరో చలన చిత్రంలో ప్రతి నాయకుని (బెస్ట్ నెగిటివ్ రోల్)గా ఎంపిక చేసినట్లు ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్స్ నుంచి సమాచారం వచ్చిందని కుమార్‌నాయక్ సోమవా రం తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ పట్టణంలోని జయదేవ్ భవన్‌లో జరగ నున్న కార్యక్రమంలో జాతీయస్థాయి నటులు అవార్డును ప్రదానం చేస్తారన్నారు.

అదనపు లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా కోదండరావు



కాశీబుగ్గ: పలాస విద్యుత్ శాఖ అదనపు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా బి.కోదండరావు నియమితులయ్యారు. దీంతో ఆయన పలాస ఈఆర్‌ఓ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ వితరణ



వాటర్ ప్యూరిఫైర్‌ను అందిస్తున్న దృశ్యం

కవిటి: కుసుంపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన బత్తిని గోపాలరావు (ప్రవాసభారతీయుడు) వాటర్ ప్యూరిఫైర్‌ను వితరణ చేశారు. రూ. పది వేల విలువైన దీన్ని స్థానిక మాతృమూర్తి యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో హెచ్ఎం త్రిలోచనబిసాయికి సోమవారం అందజేశారు. కార్యక్రమాల్లో పాఠశాల సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తలసేమియా బాలికకు రక్తదానం

కాశీబుగ్గ: వితిక అనే చిన్నారి తలసేమియాతో బాధపడుతుంది. ఈమెకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న పలాసకు చెందిన వెంకటరమణ రక్తదానం చేసి ప్రాణభిక్ష పెట్టారు. వితకకు ప్రతినెల రక్తం అవసరం. దీంతో 'ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ' ఆధ్వర్యంలో దాతలను చైతన్య పరిచి చిన్నారికి రక్తం అందిస్తున్నామని సంస్థ అధ్యక్షులు పిచ్చుక పాపారావు తెలిపారు. రక్తదాత వెంకటరమణకు కృతజ్ఞతలు తెలియజేశారు.



రక్తదానం చేస్తున్న వెంకటరమణ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కాశీబుగ్గ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన మందస మండలం కిల్లోయి గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కిల్లోయి గ్రామానికి చెందిన బృందావన గౌడ్ రోడ్డు పక్కన నడుచుకొని వెళ్తున్నాడు ద్విచక్ర వాహనంపై వచ్చిన భీమారావు, పురుషోత్తం బృందావన్ గౌడ్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై మందస ఎస్ఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఈపంట నమోదు వివరాలు పరిశీలించుకోవాలి



బేసిరామచంద్రాపురం రైతు సేవాకేంద్రంలో ప్రదర్శించిన పంటనమోదు వివరాలు పరిశీలిస్తున్న రైతులు

సోంపేట: మండలంలో ఈ–పంట నమోదు చేసుకున్న రైతులు తమ వివరాలు పరిశీలించుకోవాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదు, ఉద్యాన పంటల రైతుల వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు చెప్పారు. రెండు రోజుల్లో రైతులందరూ తమ వివరాలు పరిశీలించుకుని సవరణలు ఉంటే వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి ఆర్ఎస్‌కేలో జాబితాను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఈక్రాప్ జాబితా ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్–2024 ఈక్రాప్ సోషల్ ఆడిట్ జాబితాను సోమవారం అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి టి.భార్గవి తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16వ తేదీ వరకు ఈ జాబితాను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో సంబంధిత రైతులు జాబితాలో తమ పేర్లు నమోదు, తప్పొప్పులను సరి చూడాలని, సమస్యలు ఉంటే సంబంధిత సచివాలయం వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని అన్నారు.

శిథిలమైన రెంటికోట రోడ్డు

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట–రెంటికోట కాలనీ మధ్యలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పాడైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ శిథిలమైంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



రెంటికోట కాలనీ వద్ద పాడైన రోడ్డు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com